# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-04-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఇంటర్ పరీక్షా ఫలితాలను విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఈ రోజు విడుదల చేశారు.**

2. **మున్సిపల్ కమిషనర్లు ఉదయం నుంచే క్షేత్ర స్థాయి పర్యటనలు ఖచ్చితంగా చేయాలని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు.**

3. **ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పిలుపు నిచ్చారు.**

4. **దేశం వికసిత్ భారత్ గా మారాలంటే ప్రజల సహకారం అవసరమని పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు తెలిపారు.**

5. **ఈరోజు అంతర్జాతీయ వ్యోమగాముల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**

==========================

ఇంటర్ పరీక్షా ఫలితాలను విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఈ రోజు విడుదల చేశారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాలలో గత పదేళ్లలో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైనట్లు చెప్పారు. మొదటి సంవత్సరంలో 70 శాతం, రెండో సంవత్సరంలో 83 శాతం ఉత్తీర్ణత నమోదైందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థలలో ఫలితాలు మెరుగుపడినట్లు చెప్పారు. ఈసారి ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థులు నిరాశ చెందవద్దని సూచించారు.

విద్యార్థులు తమ ఫలితాలను ఆన్‌లైన్‌లో తెలుసుకునేందుకు తీవంబశ్రీంఎఅవ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో సందర్శించాలన్నారు. అలాగే, మన మిత్ర వాట్సాప్ నంబర్ 95523 00009 కి "హాయ్" అనీ సంక్షిప్త సందేశం పంపి ఫలితాలను పొందవచ్చు.

--------------------------

మున్సిపల్ కమిషనర్లు ఉదయం 6 గంటల నుంచే ఖచ్చితంగా క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు. రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లతో మంత్రి ఈ రోజు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్రైన్ల పూడిక తీత పనులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. మెరుగైన పారిశుధ్యం కొరకు అవసరమైన యంత్రాలను కొత్తగా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

--------------------------

కంబగిరిస్వామి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా, బనగానపల్లె నియోజకవర్గం అవుకు మండలంలో కంబగిరిస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి మంత్రి బిసి జనార్దన్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలను, తలంబ్రాలను నిన్న సమర్పించారు. అనంతరము స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...

వాయిస్... (32 సెకన్స్)

---------------------------

ప్రజలకు ప్రయోజనకరంగా ఉన్న ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పిలుపు నిచ్చారు. నెల్లూరులో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... సూర్య ఘర్ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. బ్యాంకులు ఈ పథకానికి రుణాలు ఇస్తున్నందున పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

---------------------------

దేశం వికసిత్ భారత్ గా మారాలంటే ప్రజల సహకారం ఖచ్చితంగా అవసరమని పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలిపారు. తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో ఈరోజు జరిగిన ఒకే దేశం – ఒకే ఎన్నిక సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నాలుగుసార్లు దేశంలో ఒకేసారి ఎన్నికలు జరిగాయని గుర్తు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఒకే ఎన్నిక విధానాన్ని సిఫార్సు చేస్తోందన్నారు. దేశంలో ఒకేసారి ఎన్నికలు జరిగితే 12 వేల కోట్ల రూపాయలు నిధులు ఆదా అవుతాయని పేర్కొంటూ...

వాయిస్... ( 34 సెకన్స్)

---------------------------

ఈరోజు అంతర్జాతీయ వ్యోమగాముల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. సోవియట్ యూనియన్‌కు చెందిన యూరీగగారిన్ 1961 ఏప్రిల్ 12వ తేదీన అంతరిక్షంలో ప్రయాణించిన మొదటి మానవునిగా ఘనత సాధించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఏప్రిల్ 12వ తేదీన వ్యోమగామి దినోత్సవాన్ని జరుపుకుంటూ.. వ్యోమగాములు, అంతరిక్ష శాస్త్రవేత్తలు ప్రపంచానికి అందిస్తున్న సేవలను స్మరించుకుంటున్నాం.

---------------------------

ప్రముఖ పర్యావరణ వేత్త, పద్మశ్రీ వనజీవి రామయ్య మృతికి పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. వనజీవి రామయ్య మరణ వార్త విని తీవ్ర విచారానికి లోనయ్యానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు కోటి మొక్కలు నాటిన రామయ్య కృషి స్ఫూర్తిదాయకమని సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

అదేవిధంగా, పర్యావరణ పరిరక్షణ కోసం ఆరు దశాబ్దాలుగా అలుపెరుగని కృషి చేసి, సుమారు కోటి మొక్కలు నాటిన పద్మశ్రీ 'వనజీవి' రామయ్య మరణం పట్ల ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ సంతాపం వ్యక్తం చేశారు. రామయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

ఒకే దేశం... ఒకే ఎన్నిక అనేది అద్భుతమై ఆలోచన.. అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఒకే దేశం... 'ఒకే ఎన్నిక' అంశంపై ఒంగోలులో నిన్న నిర్వహించిన మేధావుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఒకే దేశం...ఒకే ఎన్నిక అంశంపై విస్తృత స్దాయిలో చర్చలు జరగాల్సి అవసరం ఉందని. పేర్కొంటూ...

వాయిస్.... (25 సెకన్స్)

---------------------------

పేదల ఇళ్ల నిర్మాణంలో లక్ష్యాలకు అనుగుణంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని పార్వతిపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి దృశ్యమాధ్యమ సమావేశం నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి మండలంలో మే నెలలోగా 16 వందల గృహాలు పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, వారానికి 100 గృహాలు పూర్తయితే గాని అనుకున్న లక్ష్యాలను సాధించడం సాధ్యం కాదని చెప్పారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి జి లక్ష్మి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 35 సెకన్లు....

---------------------------

పోషక ఆహార లోపం, దీర్ఘ కాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పిల్లల్ని గుర్తించి వారి ఆరోగ్యం మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. ఇందుకు 'చిన్నారి ఆరోగ్యం' పేరిట నూతన కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించనున్నట్టుగా చెప్పారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులతో సమీక్ష సమావేశం నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... టీబీ తో బాధపడుతున్న పిల్లలు, హెచ్ఐవి, తల సేమియా, తదితర దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న పిల్లల్ని గుర్తించి, వారి ఆరోగ్య స్థితి గతులను పరిశీలించి, తగిన వైద్య సహాయం అందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.

=====================